మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త



## పొదల్లో ఆడ శిశువు

### శిశుకేంద్రానికి పోలీసుల తరలింపు

**న్యాల్‌కల్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త :** ఆడ బిడ్డ అనో, అక్రమ సంతానమో తెలియదు కాని పుట్టీ పుట్టగానే చితపల పండ్ల చెట్ల పొదల్లోకి వదిలేసి వెళ్లారు కసాయి తల్లిదండ్రులు. ఇందుకు సంబంధించి పోలీసులు, గ్రామస్థులు కథనం ప్రకారం... మండలంలోని రుక్మాపూర్ గ్రామంలో ఉదయం చెట్ల పొదల వద్ద ఓ కుక్క తిరగాడుతూ కూతలు వేస్తుండగా అటుగా వెళ్లిన వారు చూస్తే పసికూన కానవచ్చింది. విషయం తెలుసుకున్న ఆశా వర్కర్ సంగీత హద్నూర్ పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పసిపాపను మండలంలోని మిర్జాపూర్(బి) పిహెచ్‌సికి తరలించి ప్రథమ చికిత్సలు అందించి జహీరాబాద్‌లోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్సలు అందించగా హద్నూర్ ఎస్‌ఐ వినయ్‌కుమార్ సిడిపిఓ సూపర్‌వైజర్ సునితకు సమాచారం అందించగా సునిత ఆస్పత్రికి చేరుకుని పసిపాపను తీసుకుని సంగారెడ్డికి తరలించారు.

## సైబర్ మోసానికి గురైన పంచాయతీ కార్యదర్శి

**నాగల్‌గిద్ద, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:**
ఆన్‌లైన్‌లో ఉద్యోగం చేసుకుంటూ లక్షల్లో గడించవచ్చనే మాయ మాటలకు ఓ పంచాయితీ కార్యదర్శి మోసపోయిన సంఘటన సంగారెడ్డి జిల్లా నాగల్‌గిద్ద మండలం ముక్టాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి పూర్తి వివరాల్లోకి వెళితే... గ్రామానికి చెందిన రాజు పంచాయితీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నాడు. సైబర్ నేరగాళు అన్నీ తెలిసిన పంచాయితీ కార్యదర్శి రాజును బోల్తా కొట్టించారు. రిజిస్టార్ చేసుకుని వేయి రూపాయలు పెడితే 10వేల రూపాయలు వస్తాయని ఆశ చూపారు. విడతల వారిగా డబ్బులను బ్యాంకింగ్, ఫోన్ పే ద్వార మొత్తం 19లక్షల 56వేల 196 రూపాయలను జమ చేశాడు రాజు. డబ్బులు తిరిగి రాకపోవడంతో సంబంధిత వ్యక్తులను సంప్రదించగా ప్రాసెసింగ్ ఫీజు కింద మరో 7లక్షల కడితే డబ్బులు వస్తాయని పేర్కొనడంతో తాను మోసపోయాయని గ్రహించి పోలీసు ఠాణాలో మంగళవారం ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే, కలెక్టర్ల దృశ్యం

## కేతకి ఆలయానికి రూ. 0 లక్షలు మంజూరు

### -కో-ఆర్డినేట్ సమావేశంలో ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్

**ఝరాసంగం, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** మహాశివరాత్రి పర్వదినాలను పురస్కరించుకుని మండల కేంద్రమైన ఝరాసంగంలోని శ్రీ కేతకి సంగమేశ్వర స్వామివారి దర్శనానికి వచ్చేభక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగు ఏర్పాట్లు చేయాలని జహీరాబాద్ శాసన సభ్యులు కొనింటి మాణిక్‌రావు, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ శరత్‌లు సూచించారు. జహీరాబాద్ డిపో నుంచి ఆలయానికి ప్రత్యేక బస్సులు నడపాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డిఎస్‌పి రఘు,ఝరాసంగం, రాయికోడ్ ఎస్‌ఐలు రాజేందర్‌రెడ్డి, ఏడుకొండలు, డిసిఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, ఆలయ కమిటి చైర్మన్ నీల వెంకటేశం, సిడిసి చైర్మన్ ఉమాకాంత్ పాటిల్, ఆత్మ కమిటి చైర్మన్ పెంటారెడ్డి, సర్పంచ్ జగదీశ్వర్, ఎంపిటిసి సభ్యులు రజిని ప్రియ సంతోష్ పాటిల్, బిఆర్‌వెస్ పాఈర్ట మండల మాజీ అధ్యక్షులు బొగ్గుల సంగమేశ్వర్, విజేందర్‌రెడ్డి, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి పోటీలకు భూంపల్లి విద్యార్థి ఎంపిక

**మిరుదొడ్డి, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త :** బీహార్ రాష్ట్రంలో పాట్నాలో ఈనెల 10 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించే అథ్లెటిక్స్ హై జంప్ అండర్-14 విభాగంలో అక్బర్‌పేట-భూంపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగత చదువుతున్న విద్యార్థి బోయిని నందు పాల్గొననున్నారు. పాట్నాలో జరిగే అథ్లెటిక్స్ హై జంప్‌లో మంచి నైపుణ్యాన్ని ప్రదర్శించి తెలంగాణకు, భూంపల్లికి మంచి పేరు తీసుకు రావాలని ఉపాధ్యాయులు, గ్రామస్తులు, క్రీడాకారులు కోరుతున్నారు అథ్లెటిక్స్ పోటీలో పాల్గొంటున్న నందును పాఠశాల ప్రధానోపాధ్యాయులు జగదీశ్వర్, పీఈటీ వెంకటరెడ్డి, భూపాల్, శ్రీనివాస్‌గౌడ్, రవి, శేఖర్, వినయ్ తదితరులు అభినందించారు.

## సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలి

### -గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు జైపాల్‌నాయక్



మాట్లాడుతున్న జైపాల్‌నాయక్

**చౌటకూరు, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** ఫిబ్రవరి 15వ తారీఖున గిరి జనుల ఆరాధ్య దైవం సేవాలాల్ మహారాజ్ జయంతిని దేశవ్యాప్తంగా సెలవు దినంగా ప్రకటించాలని గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు జైపాల్‌నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో సంఘం నాయకులతో కలిసి జైపాల్‌నాయక్ మాట్లాడుతూ దేశంలో 15 కోట్ల జనాభా గల గిరిజనుల ఆరాధ్య దైవం బాలబ్రహ్మచారి సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి పర్వదినాన సెలవు ప్రకటించాలని సూచించారు. 29 రాష్ట్రాలలోని లంబాడాల అభ్యున్నతికి తన వంతు సేవలందించిన మహారాజ్ జయంతిని సెలవు ప్రకటించకపోవడం విచారకరమన్నారు. రాష్ట్రంలోని ప్రతి తండాలో జయంతి రోజున భవాని మాత, సేవాలాల్ మహారాజ్ ఆలయాల వద్ద సాంస్కృతి సాంప్రదాయాలతో పెద్ద ఎత్తున మహా బోగ్ బండార్ పూజలను నిర్వహించుకుంటారని, సెలవు లేకుంటే వారి వారి తండాలకు వెళ్లి జయంతిని ఆనందోత్సవాలతో జరుపుకునే అవకాశం ఉండదని, అందుకు ఈ సారి నుంచి ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 15న సెలవు ప్రకటించాలని వినతి చేశారు. కార్యక్రమంలో బంజారా నాయకులు రాజేందర్ నాయక్,రాజు నాయక్, శివాజీ నాయక్, అందోల్ నియోజకవర్గ గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షులు దినేష్ నాయక్, జాదావత్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ చైర్మన్‌పై కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం



అవిశ్వాస తీర్మానాన్ని అందజేస్తున్న దృశ్యం

**సదాశివపేట, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** సదాశివపేట మున్సిపల్ చైర్మన్‌పై కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం పెట్టడం జరిగింది.జిల్లా కలెక్టర్ అందుబాటులో లేనందున కార్యాలయంలో కౌన్సిలర్ల సంతకాలతో కూడిన కాపీని అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి వద్ద మహేశ్వరి మాట్లాడుతూ తెలంగాణ మున్సిపల్ 2019 చట్టం ప్రకారం మూడు సంవత్సరాల కాల పరిమితి ముగిసినందున మంగళ వారం అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. బిఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలు అందరిని సమానంగా చూస్తుందని పార్టీలో ప్రతి కార్య కర్త ముఖ్యమని అధిష్టానం సరైన నిర్ణయం తీసుకుంటుందని ఆశిస్తున్నా నన్నారు. నాకు సహకరిస్తున్న నా తోటి మిత్రులకు కృతజ్ఞతలు తెలుపుతూ వారికి వెల్లవేళలా అందుబాటులో ఉంటానని తెలిపారు.

## రేవంత్‌రెడ్డిని కలిసిన నర్సారెడ్డి

**గజ్వేల్, ఫిబ్రవరి 7 (ప్రభాతవార్త):** ఏఐసిసి ఆదేశాల మేరకు టిపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మంగళవారం ములుగు నియోజకవర్గం నుండి మొదలుపెట్టిన హత్ సే హత్ జోడో కార్యక్రమం చేపట్టగా గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి రేవంత్‌రెడ్డితో కలిసి పాదయాత్రలో పాల్గొన్నారు. ఆయనతో పాటు గజ్వేల్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు నాయిని యాదగిరి, గజ్వేల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మొనగారి రాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, శివారెడ్డి పాల్గొన్నారు.



రేవంత్‌రెడ్డితో తూంకుంట నర్సారెడ్డి





హాస్టల్ ముందు ధర్నాకు దిగిన విద్యార్థినిలు, విద్యార్థినీలకు పెడుతున్న పురుగుల అన్నం

# మాకొద్దీ...పురుగుల అన్నం, నీళ్ల చారు....!!

**కేజీబీవీ హాస్టల్ ఎదుట విద్యార్థినీల నిరసన...**

**ప్రిన్సిపాల్ ధరణిని సస్పెండ్ చేయాలని డిమాండ్**

**మద్దతు పలికిన ఏబీవీపీ సంఘం నాయకులు**

**రామాయంపేట మున్సిపాలిటీ, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త**

పురుగుల అన్నం....నీళ్లచారుతో తినలేకపోతున్నాం.. అంటూ విద్యార్థినీలు నిరసన చేపట్టారు..... తమను ఇబ్బందులకు గురిచేస్తున్న ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఏకంగా హాస్టల్ ముందు ధర్నాకు దిగారు... వివరాల్లోకి వెళ్తే రామాయంపేట మున్సిపాలిటీ రెండవ వార్డు పరిధిలోని కస్తూర్బాగాంధీ హాస్టల్‌లో విద్యార్థినీలకు కనీస వసతులు కరువయ్యాయని మంగళవారం నిరసన చేపట్టారు. హాస్టల్ ముందు కూర్చుని ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హాస్టల్లో కనీస మౌళిక సదుపాయాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గత కొన్ని రోజులుగా పురుగు పట్టిన అన్నం పెడుతున్నారని ఆరోపించారు. ఉడికి, ఉడకని కూరగాయలు, నీళ్ల చారుతో కూడిన ఆహారం తినలేక అనారోగ్యాలకు గురవుతున్నామని రోదిస్తూ తెలిపారు. అలాగే పాఠశాలలో నెలకొన్న సమస్యల గురించి ప్రిన్సిపాల్ ధరణికుమారి దృష్టికి తీసుకెళ్తే ఏమాత్రం పట్టించుకోవడం లేదని, పైగా తమపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని విద్యార్థులు వివరించారు. గతంలో హాస్టల్లో మౌలికవసతులు లేవని ఎన్నోసార్లు ప్రిన్సిపాల్‌తోపాటు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని అయినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఏబీవీపీ నాయకులతో కలిసి ధర్నా చేపట్టి తమ నిరసనను తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నగర సంయుక్త కార్యదర్శి సంపత్ కార్యకర్తలు బన్నీ, రేవంత్ తదితరులు పాల్గొన్నారు.

### సమస్య పరిష్కారానికి కృషిచేస్తా

**మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్**

కస్తూర్బా పాఠశాలలో నెలకొన్న సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని రామాయంపేట మున్సిపల్ చైర్మెన్ పల్లె జితేందర్‌గౌడ్ అన్నారు. మంగళవారం నాడు విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు చేపట్టిన ధర్నా విషయం తెలుసుకొని అక్కడికి చేరుకున్న ఆయన విద్యార్థినీలకు ఈ హామీ ఇచ్చారు. అంతే కాకుండా అక్కడి నుండే స్థానిక ఎంఈవో, డీఈవోలకు సమాచారం ఇచ్చి, ఇక్కడి సదుపాయాల గురించి వారి దృష్టికి తేసుకెళ్లారు. విద్యార్థులకు ఎట్టి పరిస్థిల్లో ఇబ్బందులకు గురికాకుండా ఇందేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న పరిష్కారానికి అందరం కలిసికట్టుగా కృషి చేద్దామని ఆయన పేర్కొన్నారు.

# సబ్బండ వర్గాల అభివృద్ధికి బడ్జెట్ ప్రాధాన్యం

**సిద్దిపేట జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ రోజాశర్మ**

**చిన్నకోడూరు, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త :**
రైతు సంక్షేమంతోపాటు సబ్బండ వర్గాల అభివృద్ధికి సిఎం కెసిఆర్ నేతృత్వంలో ఆర్థికశాఖ మంత్రి హరీష్‌రావు బడ్జెట్‌ను ప్రవేశపెట్టారని సిద్దిపేట జిల్లా పరిషత్ చైర్మన్ వేలేటీ రోజాశర్మ అన్నారు. చిన్న కోడూరులో ఆమె మంగళవారం విలేకరులతో మాట్లాడారు. మహిళలు అన్ని రంగాలలో ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. రైతులను లక్షాధికారులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రజా ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందన్నారు. అభివృద్ధి, సంక్షేమానికి బడ్జెట్‌లో పెద్ద పీట వేసిన సిఎం కెసిఆర్, మంత్రి హరీష్‌రావులకు అమె కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ప్రజా ప్రతినిధులు, పార్టీనాయకులు ఉమేష్‌చంద్ర, కాముని శ్రీనివాస్, కీసర పాపయ్య, మేడికాయల వెంకటేశం, కనకరాజు, సదానందంగౌడ్, వనితరవీందర్‌రెడ్డి, శారదరమేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రోజాశర్మ

**'కంటి వెలుగు' దేశానికి అదర్శం...**

**చిన్నకోడూరు, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త :**
కంటి వెలుగు పథకం దేశానికే అదర్శంగా నిలుస్తుందని సిద్దిపేట జిల్లా పరిషత్ చైర్మన్ వేలేటీ రోజా శర్మ అన్నారు. చిన్నకోడూరు మండల కేంద్రంలో సర్పంచ్ ఉమేష్‌చంద్ర అధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు పథకాన్ని మంగళవారం ఆమె ప్రారం భించి మాట్లాడారు. పదిరోజుల పాటు కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. 18 ఏళ్ల పైబడిన ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. చికిత్సలు చేసిన అనంతరం అవసరం ఉన్న వారికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు ఉమేష్‌చంద్ర, కీసర పాపయ్య, ఇట్టబోయిన శ్రీనివాస్, పానుగంటి శారదరమేష్, సదానందంగౌడ్, కనకరాజు, వనితరవీందర్‌రెడ్డి, డాక్టర్ సరిత, ఎంపిడిఓ శ్రీనివాస్, మహేందర్‌రెడ్డి,



మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

## గుడిసెవాసుల గోడు పట్టదా...!?

### -సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి

**హుస్నాబాద్ రూరల్, ఫిబ్రవరి 7,ప్రభాతవార్త :** మండలంలోని కూచనపల్లి గుడిసె వాసుల గోడు ప్రభుత్వాని,అధికారులకు పట్టదా అని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి ప్రశ్నించారు.మంగళవారం మండలంలోని కూచనపల్లి గ్రామంలో జరిగిన సిపిఐ గ్రామశాఖ సమావేశానికి ముఖ్య అతిధిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఏండ్లు దగుస్తున్నా గుడిసె వాసుల గోడు పట్టని ప్రభుత్వం, అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ విషయంపై జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్న వారికి ఇంటి నివేషన స్థలాల పట్టాలతో పాటు డబుల్ బెడ్‌రూంలు ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకులు బోయిని అశోక్,రాష్ట్ర సమితి సభ్యులు గడిపె మల్లేష్,రైతు సంఘం జిల్లా కార్యదర్శి యెడల వనేష్,మండల కార్యదర్శి అయిలేని సంజీవరెడ్డి,నాయకులు గూడ పద్మ,ఏఐవెఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు జనగాం రాజ్‌కుమార్,మండల నాయకులు రఘుపతి,మల్లయ్య,గ్రామ కార్యదర్శి సిద్దయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీలో కెసిఆర్ టీం

**జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 7 (ప్రభాతవార్త):** మండలకేంద్రంలో పది రోజుల నుండి నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి కెసిఆర్ క్రికెట్ టోర్నమెంట్‌లో మంగళవారం ధర్మారం గ్రామ క్రికెట్ జట్టు గజ్వేల్ కెసిఆర్ జట్టు పోటీ పడగా ధర్మారం జట్టుపై గజ్వేల్ కెసిఆర్ టీం విజయం సాధించగా మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ భగవాన్‌రెడ్డికి అందజేశారు. అంతకు ముందు రాష్ట్ర ఫారెస్ట్ కార్పోరేషన్ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి క్రీడలను పరిశీలించారు. క్రీడాకారులతో సరదాగా క్రికెట్ ఆడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలకేంద్రంలో మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రాచర్ల నరేష్ సౌజన్యంతో రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించి యువకుల్లో క్రీడా నైపుణ్యాలను పెంపొందించడం అభినందనీయమని అన్నారు. రాష్ట్ర స్థాయి నుండి క్రీడాకారులు జాతీయ స్థాయిలో పాల్గొనేలా ప్రోత్సహించేందుకు ఈ టోర్నీ ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ములుగు డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ గుండా రంగారెడ్డి, కొండపోచమ్మ ఆలయ డైరెక్టర్ కుమ్మరి కనకయ్య, ధర్మారం సర్పంచ్ పిట్టల రాజుముదిరాజ్, తెరాస నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



కెసిఆర్ టీం క్రీడాకారులతో వంటేరు ప్రతాప్‌రెడ్డి

# ది బిగ్గెస్ట్ టోర్నమెంట్ ఆఫ్ ద ఇయర్ 2022గా సిఎం కెసిఆర్ క్రికెట్ ట్రోఫీ

**బెస్ట్ అర్గనైజర్‌గా మంత్రి హరీష్‌రావు**

**బెస్ట్ సారథ్యం..బిగ్గెస్ట్ టోర్నీ అని ప్రశంసలు**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**
జిల్లా కేంద్రంలోని క్రికెట్ స్టేడియంలో మూడేళ్లుగా మంత్రి హరీష్‌రావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సిఎం కెసిఆర్ క్రికెట్ టోర్నీకి అరుదైన గౌరవం దక్కింది.2022లో సీజన్ 2 దేశంలోనే బిగ్గెస్ట్ టోర్నీగా రికార్డుకు దక్కించుకుంది. 'క్రిక్ హీరోస్' ఇచ్చే దేశ స్థాయి అవార్డు సిఎం కెసిఆర్ కప్ దేశంలోనే అత్యధిక టీమ్స్ పాల్గొనడం, మ్యాచ్‌లు నిర్వహించినందుకు క్రిక్ హీరోస్ జాతీయ స్థాయిలో అవార్డు లభించింది. ది బిగ్గెస్ట్ టోర్నీ ఆఫ్ ద ఇయర్‌గా సిఎం కెసిఆర్ కప్ అని బెస్ట్ ఆర్గనైజర్‌గా మంత్రి హరీష్ రావు అని ప్రశంసిస్తూ అవార్డును ప్రకటించింది. కాగా 3 ఏళ్ల క్రితం సిఎం కెసిఆర్ పుట్టిన రోజు పురస్కరించుకొని మంత్రి హరీష్‌రావు నేతృత్వంలో నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నీమెంట్‌ను నిర్వహిస్తున్నారు. రెండో సంవత్సరం నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ అవార్డు స్థాయి కి చేరుకుంది. సిద్దిపేట లోనే కాకుండా ఇతర ప్రాంతాల్లో కెసిఆర్ కప్ ఎప్పటికప్పుడు అన్‌లైన్‌లోచూస్తూ 19 లక్షల మంది ప్రేక్షకుల అభిమానాన్ని సిఎం కెసిఆర్ క్రికెట్ కప్ చాటుకుంది. 256మ్యాచ్‌లు, 257 టీమ్స్, 6వేల మంది క్రీడాకారులకు జాతీయస్థాయి గుర్తింపు దక్కింది. ఈ నెలలో సిఎం కెసిఆర్ పుట్టినరోజు పురస్కరించుకొని నిర్వహించే సిఎం కెసిఆర్ క్రికెట్ ట్రోఫీ సీజన్-3 ప్రారంభం రోజున క్రిక్ హీరోస్ ప్రతి నిధులు మంత్రి హరీష్‌రావుకు అవార్డును ప్రదానం చేయనున్నారు.

**సిద్దిపేట యువతకు దక్కిన గౌరవం**

సిద్దిపేట క్రీడాకారులకు, యువత క్రీడా స్ఫూర్తికి దక్కిన గౌరవం అని మంత్రి హరీష్‌రావు సంతోషం వ్యక్తం చేశారు. సిద్దిపేటలో స్టేడియాన్ని దినదినాభివృద్ధి చేసుకున్నామన్నారు. అనతి కాలంలోనే గొప్ప క్రీడా స్ఫూర్తిని సిద్దిపేట క్రీడాకారులు యువత చాటి చెప్పారని ఇదే సిఎం కెసిఆర్ ట్రోఫీతో ఇద్దరు క్రీడాకారులు రంజీ ట్రోఫీ పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. క్రికెట్ టోర్నీ నేడు సిద్దిపేట కీర్తిని దేశస్థాయిలో నిలబెట్టిందన్నారు. ట్రోఫీ రేపటి తరానికి మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. కాగా ఎంతో ప్రతిష్టాత్మకంగా యాప్ క్రిక్ హీరోస్ సిఎం కెసిఆర్ క్రికెట్ కప్‌కు అవార్డు రావడం ఎంతో సంతోషంగా ఉందని నిర్వహకులు మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, కౌన్సిలర్ కలకుంట్ల మల్లికార్జున్‌లు తెలిపారు. అవార్డు తమపై మరింత బాధ్యత పెంచిందన్నారు.

## అక్రమ రేషన్ బియ్యం తరలింపునకు తెరదించిన అధికారులు

**ఎట్టకేలకు మిరుదొడ్డి ఎంఎల్ఎస్ కేంద్రం ఇంచార్జి సస్పెన్షన్**

**దుబ్బాక ఎంఎల్ఎస్ పాయింట్ ఇంచార్జి తిరుపతిరెడ్డికి అదనపు బాధ్యతలు**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**
మిరుదొడ్డి ఎంఎల్ఎస్ పాయింట్ ఇంచార్జి అర్యనాయక్‌ను సస్పెన్షన్ చేస్తూ జిల్లా అదనపు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారని డిఎస్ఓ హరీష్ తెలిపారు. వివరాలు ఇలా ఉనా న్నయి. మిరుదొడ్డి ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి గత నెల 13న రాత్రి డిసిఎం వ్యాన్‌లో అక్రమంగా 40 క్వింటాళ్ల రేషన్ బియ్యం తరలించిన విషయం తెలిసిందే!. రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నారని ఆ నోట ఈ నోట బయటకు నొక్కడంతో అట్టి బియ్యాన్ని తిరిగి అదే ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించారు. రేషన్ బియ్యం అక్రమ తరలింపుపై 'వార్త' దినపత్రికలో ఇటీవల కథనం సైతం ప్రచురణ జరిగింది. దీంతో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి రేషన్ బియ్యం అక్రమ తరలింపుపై అక్బర్‌పేట-భూంపలి తహశీల్దార్ వీరేశంను విచారణ అధికారిగా నియమించారు. తహశీల్దార్ చేపట్టిన విచారణలో మిరుదొడ్డి ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి అక్రమంగా రేషన్ బియ్యం తరలించిన విషయం వాస్తవమేనని తెలింది. దీంతో విచారణ అధికారి ఇచ్చిన నివేదిక అధారంగా మిరుదొడ్డి ఎంఎల్ఎస్ పాయింట్ ఇంచార్జ్ అర్ యనాయక్‌ను ఈ మేరకు సస్పెన్షన్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ఎంఎల్ఎస్ పాయింట్ ఇంచార్జ్ రేషన్ డీలర్లకు పంపిణీ చేసే బియ్యంలో సైతం పలు అవకతవకలకు పాల్పడినట్లు విచారణలో తేలి నట్లు తెలిసింది. మిరుదొడ్డి ఎంఎల్ఎస్ పాయింట్ ఇంచార్జి అర్యనాయక్ స్థానంలో దుబ్బాక ఎంఎల్ఎస్ పాయింట్ ఇంచార్జి తిరుపతిరెడ్డికి అదనపు బాధ్యతలు అప్పగించారు. మొత్తం మీద అక్రమ రేషన్ బియ్యం తరలింపులో ఎంఎల్ఎస్ పాయింట్ ఇంచార్జి అర్యనాయక్‌ను సస్పెన్షన్ చేస్తూ అధికారులు తెర దించారు.

## నాటి వార్త కథనం...నేడు నిజం




**సంగారెడ్డి, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** హత్నూర మండలం శేర్‌ఖాన్‌పల్లి గ్రామం పరిధిలోని పలుగుమీద పోచమ్మ దేవాస్థానం ఆలయ కమిటీ నూతన చైర్మన్ ఎన్నికపై గతంలో 'వార్త'లో ప్రచురితమైన కథనం నేడు నిజమైంది. దేవాలయం కమిటీ చైర్మన్‌గా ఎన్.సుదర్శన్ గౌడ్ ఎన్నిక కానున్నట్లు గత మే నెల 16న, వార్త దినపత్రకలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఆ రోజు ప్రచురించిన విధంగానే ప్రభుత్వం శేర్‌ఖాన్‌పల్లి గ్రామానికి చెందిన సుదర్శన్‌గౌడ్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.నూతనంగా ఎన్నికైన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే సి.హెచ్.మదన్‌రెడ్డి, రాష్ట్ర మహిళా కమీషన్ చైర్‌పర్సన్ వి.సునితాలక్ష్మారెడ్డిలు హాజరయ్యారు.

## ఆరోగ్యమే మహాభాగ్యం, అందరూ బాగుండాలి

### న్యాయమూర్తి జూనియర్ సివిల్ జడ్జి అనిత



హెల్త్ క్యాంప్‌లో పాల్గొన్న అనిత తదితరులు

**నర్సాపూర్, ఫిబ్రవరి 7,ప్రభాతవార్త:** అందరూ ఆరోగ్యంగా ఉండాలని పేర్కొంటూ ఆరోగ్యమే మహాభాగ్యమని నర్సాపూర్ కోర్టు న్యాయమూర్తి, జూనియర్ సివిల్ జడ్జి కె.అనిత పేర్కొన్నారు. మంగళవారం నర్సాపూర్‌లోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో మండల్‌లీగల్ సర్వీసెస్ కమిటీ నర్సాపూర్ అధ్వర్యంలో మెడికల్ క్యాంపును నిర్వహించారు. ఈ కార్యక్రమంలోన్యాయమూర్తి, జూనియర్ సివిల్ జడ్జి, మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ కె.అనిత పాల్గొని హెల్త్ క్యాంపును ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండటం కోసం వ్యాయాయం, యోగా, వివిద రకాల క్రీడలను అలవర్చుకోవాలన్నారు.అంతేగాక ఆకుకూరలు, పండ్లు వంటి ఆహారాన్ని తీసుకొని ఆరోగ్యంగా ఉండాలన్నారు.ఆరోగ్యమే మహాభాగ్యమని ఆమె పేర్కొన్నారు. ఈమేరకు కోర్టు ఆవరణలో నిర్వహించిన హెల్త్ క్యాంపును అందరు సద్వినియోగం చేసుకోవాలని న్యాయమూర్తి, జూనియర్ సివిల్ జడ్జి కె. అనిత సూచించారు. ఈ సందర్భంగా రెడ్డిపల్లి పిహెచ్‌సి డాక్టర్లు, సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించి కంటి అద్దాలు, మందులు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో న్యాయవాదులు ఏపిపి రాఘవేందర్, ఏజిపి సత్యనారాయణ, సీనియర్ న్యాయవాది ఎండి జాఫర్ అలీ,న్యాయవాది అంజిరెడ్డి, డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ విజయనిర్మల,ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ మీర్జా, డాక్టర్ రఘువరన్, డాక్టర్ సాహిత్యరత్న సీనియర్ న్యాయవాది ఎండి ఖాజామోహినొద్దీన్, న్యాయవాదులు జి.శ్రీనివాస్. ఏ.శ్రీనివాస్, కె.ఏ శ్రీనివాస్, కె.ప్రకాష్, స్వరూపరాణి, ఆనంద్‌కుమార్, మధుశ్రీ, కోర్టు సూపరిండెంట్ జంగ శ్రీనివాస్, లీగల్ సర్వీసెస్ సిబ్బంది, ఆంజనేయులు, వై.శ్రీనివాస్, వైద్యసిబ్బంది, కోర్టు సిబ్బంది, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నల్ల పోచమ్మకు బోనాలు



బోనలను తీసుకెళుతున్న మహిళలు

**వెల్దుర్తి, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:** మండల పరిధిలోని చర్లపల్లి గ్రామంలో రెండు రోజుల నుండి గ్రామంలో వెలసిన శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయ వార్షికోత్సవాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా మంగళవారం గ్రామ శివారులో వెలసిన నల్ల పోచమ్మకు మహిళలు ఘనంగా బోనాల ఊరేగింపు నిర్వహించారు. ప్రతి సారి జరిగే ఈ మహోత్సవంలో భాగంగా ఈ సారి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కోరిన కోరికలు తీర్చాలని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు, భక్తులు, పరిసర ప్రాంత ప్రజలు పాల్గొన్నారు.

## నేడు మండల సర్వసభ్య సమావేశం

**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 7,ప్రభాతవార్త:** నేడు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ప్రవీణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ ఆవుల భాగ్యలక్ష్మీరెడ్డి అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహిస్తున్నామని మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి ఆయా శాఖల ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు, సర్పంచులు, ఎంపిటీసీలు, ప్రజలు పాల్గొనాలని ఆయన సూచించారు.

## 11 నుంచి మండలంలో కార్నర్ సమావేశాలు

**పాపన్నపేట, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** ఈ నెల 11వ తారీఖు నుంచి రాష్ట్ర వ్యాప్తంగా కార్నర్ సమావేశాలు నిర్వహించాలని పార్టీ అధిష్టానం ఆదేశాలు జారీ చేసిందని మెదక్ జిల్లా భారతీయ జనతా పార్టీ అసెంబ్లీ కన్వీనర్ ఎక్కల దేవి మధుసూధన్, మండల శాఖ అధ్యక్షులు వడ్ల సంతోష్ చారిలు పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రమైన పాపన్నపేట పార్టీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా ఎక్కల దేవి మధుసూదన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎక్కలదేవి మధుసూదన్, వడ్ల సంతోష్‌లు మాట్లాడుతూ మండలంలోని మూడు లేదా నాలుగు బూతులు కలిపి ఒక శక్తి కేంద్రంగా విస్తరించి శక్తి కేంద్రాల వారిగా కార్నర్ సమావేశాలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ఈ నెల 11 నుంచి 25వ తేది వరకు ప్రతి రోజు ఒక శక్తి కేంద్రంలుఒ కార్నర్ మీటింగ్ లు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు మల్లం నారాయణ, శ్రీరామ్ నరేష్, మండల ప్రధాన కార్యదర్శులు రాజు బిక్షపతి, ఉపాధ్యక్షులు బొక్కల భాగేష్, ఓబిసి ప్రధాన కార్యదర్శి వడ్ల భాగేష్, మైనార్టీ మోర్చా అధ్యక్షులు సయ్యద్‌గౌస్, మండలకార్యదర్శులు నర్సింలు, చంద్రయ్య, జగదీష్, లక్ష్మణ్, రాజు, నర్సింలు, అరుణ్, పెంటయ్య, సాయిబాబా, దుర్గయ్య, శ్రావణ్, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకు వార్షికోత్సవ ఆహ్వాన పత్రిక అందజేత



ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందిస్తున్న రుద్రారం సర్పంచి లక్ష్మణ్

**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 7,ప్రభాతవార్త:** మహాశివరాత్రి సందర్భంగా చిన్నశంకరంపేట మండలం రుద్రారం గ్రామంలో నిర్వహించే శ్రీ సంగ మేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాలకురావాలని సర్పంచి లక్ష్మణ్, ఆలయ అభివృద్ధి కమిటి ఆధ్వర్యంలో సభ్యులు మంగళవారం మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్ రెడ్డిలను భాగ్యనగరంలోని వారి నివాసంలో కలిసి ఆహ్వాన పత్రికను అందించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రాజు, తదితరులు ఉన్నారు.

## కంటివెలుగు శిబిరాన్ని పరిశీలించిన డిపివో

**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 7,ప్రభాతవార్త:** ప్రజలు కంటి సమస్యలతో బాధపడకూడదనే ఉద్దేశంతోనే ప్రభుత్వం కంటివెలుగు కార్యక్రమం చేపట్టిం దని జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబ అన్నారు. మంగళవారం మండల పరిధి సంగాయపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిభిరాన్ని ఆయన పరిశిలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కంటి సమస్యలతో ప్రజలు ఇబ్బంది పడకూడదని లక్ష్యంతో కంటి పరీక్షలను నిర్వహించి, అద్దాలతో పాటు, మందులు, అవసరమైన వారికి శస్త్ర చికిత్స లను ప్రభుత్వం ఉచితంగా చేయిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో డిఎల్‌పివో రాజేంద్రప్రసాద్, ఎంపీవో గిరిధర్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి : ఎంపిడివో



కామారంలో పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న ఎంపిడివో ప్రవిణ్

**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 7,ప్రభాతవార్త:** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలను నాటి, వాటిని సంరక్షించాలని ఎంపీడీవో ప్రవిణ్ తెలిపారు. మంగళవారం చిన్నశంకరంపేట మండలం కామారం గ్రామాన్ని సందర్శించి, పల్లె ప్రకృతివనం, నర్సరీ,డంప్ యార్డ్‌లను పరిశిలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ హరిత హారంలో పెంచె మొక్కలపై ప్రత్యేక శ్రద్ద వహించాలని సూచించారు. నర్సరీలలో మొక్క లను ఎండిపోకుండా చూడాలని సూచించారు. ఈ సందర్బంగా నూతనం గా బదలిపై వచ్చిన ఎంపీడీవో ప్రవిణ్‌ను గ్రామ సర్పంచి పూలపల్లి యాదగిరి యాదవ్ , పాలకవర్గ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుహసిని తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షమమే ధ్యేయంగా సిఎం కెసిఆర్ ప్రభుత్వం

## కళ్యాణలక్ష్మి షాదీముబారక్ చెక్కుల పంపిణీ

**నర్సాపూర్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:** ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సిఎం కెసిఆర్ ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి పేర్కొన్నారు.మంగళవారం నర్సాపూర్‌లోని మండల పరిషత్ సమావేశ మందిరంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్దిదారులకు మంజూరైన 34 మందికి కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కు లను ఎమ్మెల్యే మదన్‌రెడ్డి చేతుల మీదుగా పంపణీ చేయడం జరిగింది.ఈ సందర్బంగా ఎమ్మెల్యే మదన్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రవేశ పెడుతున్న ప్రజాసంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తు న్నాయనిన్నారు. ఆడబిడ్డల తల్లిదండ్రులకు అండగా నిలవాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి కెసిఆర్ కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను ప్రవేశ పెట్టాడని తెలిపారు. ఈమేరకు ఆడబిడ్డల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోని బాగుపడాలన్నారు. ప్రజల సంక్షేమం కోసం కెసిఆర్ కృషి చేస్తున్నాడని వెల్లడించారు. ఈకార్యక్రమంలో ఎంపిపి జ్యోతి సురేశ్‌నాయక్, జడ్‌పిటీసి బాబ్యానాయక్, జిల్లా కోఆప్షన్ సభ్యులు మన్సూర్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఫైడి శ్రీధర్‌గుప్త, ఎంపిపి ఉపాధ్యక్షులు వెంకటనర్సింగరావు, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు జితేందర్‌రెడ్డి, మండల తహాశీల్దార్ ఆంజనేయులు, మున్సిఫల్ కమీషనర్ వెంకట్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఏకరూప దుస్తులు పంపిణీ

**చిన్నశంకరంపేట,ఫిబ్రవరి 7,ప్రభాతవార్త:** విద్యార్థులు శ్రద్దగా చదువు కోని ఉన్నత స్థానాలకు ఎదగాలని చందాపూర్ గ్రామ సర్పంచి పడాల రమాదేవి అన్నారు. మంగళవారం మండల పరిధి చందాపూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆమె ఏకరూప దుస్తులను పంపిణి చేశారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువును నిర్లక్ష్యం చేయకూడదని, ఒక నిర్దిష్ట ప్రణాళికతో చదువుకోని ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజు, అంగన్‌వాడి టిచర్, విద్యార్థులు పాల్గొన్నారు.

## కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి : సర్పంచ్

**రామాయంపేట మున్సిపాలిటీ, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రామాయంపేట మండలం దామరచెరువు గ్రామ సర్పంచ్ పడాల శివప్రసాద్‌రావు అన్నారు. మంగళవారం నాడు గ్రామంలో ఎంపిపి బిక్షపతి, ఎంపీటీసీ పాకాల శ్రీలత చంద్రశేఖర రావుల తో కలిసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎంతో మందికి పైసా ఖర్చులేకుండా ఉచితంగా కంటి అద్దాలు అందజేయడంతో పాటు అవసరమైనవారికి ఆపరేషన్లు చేయడం జరుగుతుందన్నారు. ఈ అవకా శాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో ఎంపిడీవో ఉమాదేవి, ఎంపీఓ గిరిజారాణి, గ్రామ ఉపసర్పంచ్, డి.ధర్మా రం పిహెచ్‌సి డాక్టర్ హరిప్రియ, పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి, ఏఎన్ఎం యశోద, అంగన్‌వాడి, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ శివప్రసాద్‌రావు

# కొల్చారం గ్రామాన్ని నందనవనంగా తీర్చిదిద్దుతా

### నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి



సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

**కొల్చారం, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:** కొల్చారం గ్రామాన్ని నందనవనంగా తీర్చిదిద్దుతా మని నర్సాపూర్ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం కొల్చారం గ్రామంలో ఎస్‌డి ఎఫ్ నిధుల ద్వారా చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే మదన్‌రెడ్డి లాంఛనంగా ప్రారం భించారు. కొల్చారం గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణం కోసం ఎమ్మెల్యే మదన్‌రెడ్డి కృషితో ఎస్‌డిఎఫ్ నిధుల ద్వారా 55 లక్షలు మంజూరయ్యాయని, ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై స్థానిక సర్పంచి ఉమా రాజాగౌడ్‌తో కలిసి సీసీ రోడ్డు పనులను లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మదన్‌రెడ్డి మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులు చేయాలని గుత్తేదారు మన్నె శ్రీనివాస్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మంజులకాశీనాథ్, జెడ్పీటీసీ మేఘమాల సంతోష్‌కుమార్, జిల్లా కోఆప్షన్ సభ్యులు మన్సూర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రా గౌడ్, రాష్ట్ర నాయకులు పైడి శ్రీధర్‌గుప్త, ఎంపీ డీవో గణేష్‌రెడ్డి, సర్పంచులు ఉమ రాజాగౌడ్, గోదావరి, ఇందిర ప్రియదర్శిని సందీప్, మనెన శ్రీనివాస్, దేవన్నగారి శేఖర్, యూత్ ఐకాన్ యాబన్న గారి రవితేజారెడ్డి, కారోబార్ వడ్ల ప్రభాకర్, గ్రామ కార్యదర్శి అంజయ్య, మెదక్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చందపురం సావిత్రిరెడ్డి, సర్పంచి నెల్లి కిష్టయ్య, మాజీ ఉప సర్పంచి చౌరిగారి చిన్న రాములు, బీఆర్ఎస్ నాయకులు రత్నయ్య, కాశీ, సంతోష్ కుమార్, జూలకంటి సంగమేశ్వర్, వార్డు సభ్యులు పెద్దపురం అశోక్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీల చైర్మన్లు పాల్గొన్నారు.

## కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులు పంపిణీ

**కొల్చారం, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:** మంగళవారం కొల్చారంలోని మండల పరిషత్ కార్యాలయంలో కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కు లను తహశీల్దార్ చంద్రశేఖర్‌రావు ఆధ్వర్యంలో 22 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

## రామాయంపేటలో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

**రామాయంపేట, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త :** రామాయంపేట పట్టణంలోని సత్యసాయి ఆర్గనైజేషన్ సేవా సంస్థ వారి ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన ఎంఎన్‌జె హాస్పిటల్ వారి సౌజన్యంతో మంగళవారం నాడు ఏర్పాటు చేసిన క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల కేంద్రాన్ని స్థానిక మున్సిపల్ చైర్మెన్ పల్లె జితేందర్‌గౌడ్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేయడం చాలా గొప్ప విషయమన్నారు. అందుకు శ్రీ సత్యసాయి సేవా సమితి వారు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం చాలా సంతోషమన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంఎన్‌జె హాస్పిటల్‌కు చెందిన డాక్టర్లు ఎన్. జయలత టీం ఆధ్వర్యంలో సౌజన్య, సోమిత్రి, అసదుద్దీన్, అమీన్, కో ఆర్డినే టర్ ప్రసాద్‌లు కార్యక్రమంలో పాల్గొని పట్టణంలో పేర్లు నమోదు చేసుకున్న రెండువందల మందికి హైదరాబాద్ నుంచి వచ్చిన ప్రత్యేక బస్సు, అధునాతన పరీక్ష యంత్రాలలతో డాక్టర్లు స్థానిక స్వర్ణకార భవనంలో, సత్యసాయి సమితి సేవా భవనంలో వారు ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యెనిశెట్టి బాల్‌చందర్, గౌరిశెట్టి శ్రీనివాస్, యెనిశెట్టి గౌరీశంకర్, నాగరాజు, మల్లేశంతో పాటు కాలనీ వాసులు పాల్గొన్నారు.

## కంటి పరీక్షలు ప్రతి ఒక్కరూ చేయించుకోవాలి : ఎంపిపి

**పెద్దశంకరంపేట, ఫిబ్రవరి7 ప్రభాతవార్త:** కంటి పరీక్షలను ప్రతి ఒక్కరూ చేయించుకోవాలని ఎంపీపీ జంగం శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని పాత పంచాయితీ భవనంలో కొనసాగుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని మంగళవారం ఎంపీపీ జంగం శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అవసరమున్న వారికి అద్దాలను అందించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ వీణ సుభాష్‌గౌడ్‌తో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## లబ్దిదారులకు కళ్యాణలక్ష్మీ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే

**కంగ్టి, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:** మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ లబ్దిదారులకు 86 చెక్కులను నారాయణఖేడ్ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందరర్భంగా ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలో ఇప్పటివరకు దాదాపు 3 వేల చెక్కులను పంపిణీ చేయడం జరిగిందని, ఆడ బిడ్డలు ఉన్న తల్లిదండ్రులు కేసీఆర్ పాలనలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అలాగే గ్రామాల్లో త్రాగునీరు, విద్యుత్‌ను నిరంతరం సరఫరా చేస్తున్న రాష్ట్రం తెలంగాణయే అని, అది సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమవుతుం దన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనను, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి ఇతర రాష్ట్రాల నుండి అనేక నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరుతు న్నారన్నారు. అదేవిధంగా ప్రతి గ్రామం, పల్లెలో సీసీ రోడ్లను నిర్మిస్తున్నా మన్నారు. గత ప్రభుత్వాలు చేసిన అభివృద్ధి ఏమి లేదని దుయ్యబట్టారు. అలాగే తడ్కల్ నూతన మండలం ఏర్పాటుకు కృషి చేస్తున్నానని, అతి తొందరలోనే కొత్త మండలం ఏర్పాటు అవుతుందని ప్రజలకు భరోసా ఇచ్చారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు మండలం ఏర్పాటు కాకుండా దీక్షలు చేసి అడ్డుపడుతున్నారన్నారు. ఎట్టి పరిస్థితుల్లో అతి త్వరలోనే శుభవార్త వింటామనాన్నరు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సంగీత వెంకట్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రేఖ చంద్రశేఖర్‌రెడ్డి, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎస్‌కె. గంగాధర్, కంగ్టి గ్రామ ఇంచార్జి సర్పంచి నర్సమ్మ, డిప్యూటీ తహశీల్దార్ జుబేర్ అహ్మద్, ఆర్ఐ లక్ష్మణ్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని వినతి

**మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి7 ప్రభాతవార్త:** మంత్రి హరీష్‌రావు ఇచ్చిన మాట ప్రకారం తూప్రాన్ మండల కేంద్రంలో డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ తూప్రాన్ డివిజన్ కార్యదర్శి కార్తీక్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఏవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్తీక్ మాట్లాడుతూ తూప్రాన్ మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యార్థులు పై చదువులు చది వేందుకకు డిగ్రీ కళాశాలకు మెదక్ లేదా గజ్వేల్‌కు వెళ్లే పరిస్థితి ఏర్పడిం దన్నారు. తూప్రాన్ మండల కేంద్రంలో డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేస్తామని మంత్రి హరీష్‌రావు ఇచ్చిన హామీని ఇప్పటి వరకు నెరవేర్చలేదన్నారు. ఇప్పట కైనా అధికారులు స్పందించి తూప్రాన్ మండల కేంద్రంలో డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేని యెడల విద్యార్థులను ఐక్యం చేసి అధికారుల కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో డివిజన్ సభ్యులు రమేష్, శివాజీ, జగన్, ప్రవీణ్ పాల్గొన్నారు.



ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు



నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు, కార్యవర్గం

## కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తా

### పార్టీ మండల అధ్యక్షులు నాగులగారి మల్లేశంగౌడ్

**కొల్చారం, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, తనపై నమ్మకం ఉంచి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా వరుసగా రెండవ సారి ఎన్నుకున్నందుకు ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు కృతజ్ఞతలని నూతనంగా ఎన్నికైన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగులగారి మల్లేశంగౌడ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చిన్న ఘనపూర్ ఆనకట్ట ప్రక్కన దుర్గమ్మ ఆలయం ఆవరణలో కాంగ్రెస్ ఎన్నికల పరిశీలకులు టీపీసీసీ ఓబీసీ సెల్ కార్యదర్శి మురళీధర్ పర్యవేక్షణలో మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశా నికి మండలంలోని కాంగ్రెస్ కార్యకర్తలు హాజరయ్యారు. అనంతరం నూతనం గా కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కిష్టాపూర్ గ్రామానికి చెందిన నాగులగారి మల్లేశంగౌడ్ ఎన్నిక య్యారు. బీసీ సెల్ మండల అధ్యక్షులుగా బండి మల్లేశం, కొప్పుల యేసు రాజు, ఎస్టీ సెల్ మండల అధ్యక్షులుగా శంకర్ నాయక్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా దర్జి రాజు, మండల కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్‌గా గొండ కృష్ణ, గోవర్ధన్, కిష్టయ్య, ప్రధాన కార్యదర్శిగా చందపురం మధుసూదన్‌రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి మరెల్లి అనిల్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు అక్రమ్, మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎనగండ్ల మురళి, కృష్ణాగౌడ్, తుక్కాపూర్ రాములు, వెంకటేశంగౌడ్, గొండ కృష్ణ, మహేశ్వర్‌రెడ్డి, అనిల్ కుమార్, రాములు, జోగిపేట విఠల్‌గౌడ్, అంజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మహా శివరాత్రి రోజు శ్రీశైలం వెళ్లే భక్తులకు ప్రత్యేక బస్సులు

**పటాన్‌చెరు, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** మహ శివరాత్రి పర్వదినాన శ్రీశైలం వెళ్ళే భక్తుల సౌకర్యార్థం టిఎస్ఆర్‌టిసి ప్రత్యేక సర్వీసులు ఫిబ్రవరి 16 నుండి ఎంజిబిఎస్, జెబిఎస్, దిల్‌సుఖ్‌నగర్, ఐఎస్ సదన్, బిహెచ్ఈఎల్ ఉండి బస్సులు నడవుచున్నది. ఫిబ్రవరి 16న 36, 17న 99, 18న 99, 19న 88 మొత్తం 322 ప్రత్యేక బస్సులు నడుపుతుంది. ఎంజిబిఎస్ నుండి సూపర్ లెగ్జరీ కు రూ. 600, డీలక్స్‌కు రూ. 540, ఎక్స్‌ప్రెస్‌కు రూ. 460, సిటీలోని ఇతర ప్రాంతాల నుండి సూపర్ లెగ్జరీ కు రూ. 650, డీలక్స్‌కు ర. 580, ఎక్స్‌ప్రెస్‌కు రూ. 500 గా ఛార్జీలు ఉండును. మరిన్ని వివరాలను సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు ఎంజిబిఎస్ మొబైల్ నెంబర్: 9959226250, జెబిఎస్: 9995922625, ఐఎస్ సదన్ 9959225 250, బిహెచ్ఈఎల్, కెపిహెచ్‌బి ప్రయాణీకులు: 9959222614 నెంబర్‌ను సంప్రదించాలని, భక్తులు ఎటిబి ఎంజెట్స్ వద్ద ద్వారా కానీ ముందస్తుగా టికెట్స్ బుక్ చేసుకోగలని రంగారెడ్డి రీజనల్ మేనేజర్ శ్రీధర్, బిహెచ్ఈఎల్ మేనేజర్ సుధాకర్ లు మంగళవారం నాడొక ప్రకటనలో తెలియజేశారు.

## అంగన్‌వాడీ టీచర్ల సమయపాలన పాటించాలి

**అల్లాదుర్గం, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** అంగన్వాడీ ప్రాజెక్ట్ పరిధిలో పనిచేస్తున్న ప్రతి అంగన్వాడీ టీచర్ సమయపాలన పాటించాలని జిల్లా సంక్షేమ అధికారి బ్రహ్మజీ అన్నారు. మంగళవారంనఅల్లాదుర్గం అంగన్వాడీ ప్రాజెక్ట్ పరిధిలోని కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లు సమయపాలన పాటించాలని, న్యూట్రి గార్డెన్ పెట్టాలని ఆమె సూచించారు. విధి నిర్వహణలో ఏ చిన్నపొరపాటు లేకుండా పనిచేయాలని తెలిపారు. గతనెలలో అంగన్‌వాడీ రిపోర్ట్‌లపైన సమీక్ష చేశారు. బాలల హక్కులు 1098పైన మహిళ చట్టాలు, 181పైన తల్లిదండ్రులు, వృద్ధుల చట్టం, వయోవృద్ధుల హెల్ప్‌లైన్ 14567, దివ్యాంగుల హెల్ప్‌లైన్ 155326 పైన టీచర్లపై అవగాహన కల్పించారు. అలాగే కస్తూరిబా గాంధీ పాఠశాలల్లో, కాయిదంపల్లి గ్రామాలలో బాల్య వివాహాలు, మహిళచట్టాలు, సేఫ్ టచ్–అన్ సేఫ్ టచ్‌పై ఫిల్మ్‌షో ద్వార అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ హేమ భార్గవి, మహిళ శక్తి కేంద్రం అధికారిణి సంతోష, ఐసిపిఎస్ సిబ్బంది నాగరాజు, మధుకర్, వృద్ధుల హెల్ప్‌లైన్ అధికారి బాలరాజు, పోషణ్ అభియాన్ జిల్లా కో–ఆర్డినేటర్ వెంకట్, నర్సాపూర్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ బేతయ్య, ఐసిడిఎస్ సూపర్‌వెజర్లు నాగమణి, కృష్ణవేణి, పుష్పలత, భారతీ, భాగ్య, అంగన్వాడీ కేంద్రాల టీచర్లు పాల్గొన్నారు.

## హుస్నాబాద్ నూతన ఎస్ఐగా తోట మహేష్ ....?

**హుస్నాబాద్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త :** హుస్నాబాద్ ఎస్ఐగా ఇంతకాలం బాధ్యతలు నిర్వర్తించిన ఎస్ఐ సజ్జనపు శ్రీధర్‌ను ఇక్కడి నుండి బతిలీ చేస్తూ నూతన ఎస్ఐగా తోట మహేష్‌ను నియమించినట్లు విశ్వసనీయ సమాచారం మేరకు తెలిసింది. ఎస్ఐ శ్రీధర్ రెండున్నరేళ్ళ కాలంగా పని చేసి ఇక్కడి ప్రజల్లో మంచిపేరునే తెచ్చుకున్నాడుజనూతనంగా బాధ్యతలు చేపడుతున్న మహేష్ ఇంతకాలం కరీంనగర్ జిల్లాలోని టూటౌన్ పోలీస్‌స్టేషన:లో బాధ్యతలు నిర్వర్తిస్తూ హుస్నాబాద్‌కు బదిలీ చేసినట్లు సమాచారం.

# మండలంలో హాత్ సే హాత్ జోడో యాత్ర

**పాపన్నపేట, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమాన్ని మరిచి ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్నాయంటూ మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, పిసిసి సభ్యులు మ్యాడం బాలకృష్ణ, మామిడ్ల ఆంజనేయులులు మండిపడ్డారు. మంగళ వారం మండల పరిధిలోని రామతీర్థం, ముద్దా పురం గ్రామాల్లో ఏఐసిసి, టి పిసిసి ఆదేశాల మేరకు హాత్ సే హాత్ జోడో కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఆయా గ్రామాల్లో పార్టీ జండాను ఆవి ష్కరించి ప్రజలకు రాహుల్ గాంధీ సందేశ పత్రా లను పంపిణి చేశారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని గడప గడపకు వెళ్లి రాహుల్ గాంధీ సందేశ పత్రాలను పంపిణి చేస్తామన్నారు. కార్యక్రమం ద్వార రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే చేపట్టే కార్యక్రమాలపై వివరించడం జరి గిందన్నారు. ఎన్నికల సందర్బంగా చేసిన హామీ లను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమయిందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఏకకాలంలో రైతుల పంట రుణాలను మాఫీ చేస్తామన్నారు. కార్యక్రమంలో కిసాన్‌సెల్ జిల్లా కార్యదర్శి నవితలాక్షప్ప, ఎంపిటిసి సభ్యులు ఆకుల శ్రీనివాస్, రమేష్‌గౌడ్, నాయకులు ఈశ్వరప్ప, శంకరప్ప, ఉరటి ఆంజనేయులు, మదుసూధన్‌రెడ్డి, మంవడల మైనార్టీ నాయకులు కలిమియా తదితరులు పాల్గొన్నారు.



హాత్ సే హాత్ జోడో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం



మంత్రికి ఆహ్వానపత్రిక అందజేస్తున్న వెంకటేశ్వరశర్మ, శివకుమార్‌గౌడ్

### భగళాముఖి అమ్మవారి మహోత్సవాల

## ఆహ్వాన పత్రికను మంత్రులకు అందజేత

**మెదక్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:** శివ్వంపేట మండల కేంద్రంలోని శ్రీ భగళాముఖి (శక్తిపీఠం) బాలాలయంలో ఈ నెల 8, 9, 10వ తేదీలలో జరిగే దేవస్థానం ప్రారంభోత్సవంతో పాటు అమ్మవారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలకు హాజరు కావాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీష్‌రావు, దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిలకు ఆహ్వాన పత్రికను అందజే యడం జరిగింది. శక్తిపీఠం వ్యవస్థాపకులు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ, ట్రస్టు సభ్యులు, హైకోర్టు న్యాయవాది శివకుమార్‌గౌడ్, స్థల దాత, రాష్ట్ర నాయ కులు పబ్బా రమేష్‌గుప్త, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రామిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు వై.రమణాగౌడ్, శివ్వంపేట సర్పంచి శ్రీనివాస్‌గౌడ్‌లు మంగళ వారం మర్యాదపూర్వకంగా కలిసి వారికి ఆహ్వానం అందించారు. దీనిపై సానుకూలంగా ఆదరించిన ఆహ్వానాన్ని అందుకున్న మంత్రులు తప్పకుండా భగళాముఖి అమ్మవారిని దర్శించుకుంటామని అన్నారని ట్రస్టు సభ్యులు తెలిపారు. అమ్మవారి మహోత్సవాలను విజయవంతంచేయాల్సిన బాధ్యత ట్రస్టు సభ్యులతో పాటు ప్రజలందరిపై ఉందని మంత్రులు అన్నారు.

## కొనసాగిన ఏసిబి సోదాలు



మాట్లాడుతున్న ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్

**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 7,ప్రభాతవార్త:** చిన్నశంకరంపేట మండలం సంగాయపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్ అనే రైతు వద్ద మండల ఆర్ఐ శ్రీహరితో పాటు చందంపేట గ్రామానికి చెందిన విఆర్ఏ సురేష్ బాబు లక్ష రుపాయలు లంచం తిసుకుంటూ పట్టుబడిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్ మంగళవారం మరో మారు తహసీల్దార్ కార్యాలయంతో పాటు మెదక్‌లో నివాసం ఉండే ఆర్ఐ శ్రీహరి ఇంటిలో, చందంపేట గ్రామంలోని విఆర్ఏ సురేష్ బాబు ఇండ్లలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ సోదాలలో విలువైన పత్రాలు లభించాయని, వాటిని పరిశిలిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఆర్ఐ,విఆర్ఏ లను అరెస్టు చేశామని, భాగ్యనగరంలోని ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో వారిని హాజరుపర్చనున్నట్లు డీఎస్పీ ఆనంద్ కుమార్ తెలిపారు. ఆయన వెంట సిఐలు వెంకట్ రాజ్‌గౌడ్, రమేష్‌లు ఉన్నారు.

**లంచం అడిగితే సమాచారం ఇవ్వండి... ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్**

ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు లంచం అడిగితే తమ దృష్టికి తిసుకరావాలని, లంచం ఇవ్వడానికి ఎవరూ ప్రెరెపించకూడదని, ప్రభుత్వ అధికారులు ప్రభుత్వం అందించే జీత భత్యాలను పొందుతూ ప్రజలకు సేవ చేయడానికే ఉన్నారని ఆయన తెలిపారు. ఏ అధికారి అయినా లంచం ఆశిస్తే జైలు పాలు కాక తప్పదని ఆయన హెచ్చరించారు.

## శివ్వంపేటలో పర్యటించిన జెడ్పీటీసీ

**మెదక్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:** శివ్వంపేటమండలంలోని వివిధ గ్రామా ల్లో జిల్లా పరిషత్ ప్రణాళిక సంఘం సభ్యులు, స్థానిక జెడ్పీటీసీ సభ్యులు పబ్బా మహేష్‌గుప్త మంగళవారం పర్యటించారు. మండల కేంద్రానికి చెందిన శేరిపల్లి సత్తమ్మ అనారోగ్యంతో బాధపడుతున్న దృష్ట్యా ఆమె కుటుంబ సభ్యులను ఓదారుస్తూ 5 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్బంగా వారి కుటుంబ సభ్యులకు ధైర్యం కూడా కల్పించారు. అదేవిధంగా మండల పరిధిలోని రెడ్యా తండాలో జరుగుతున్న రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయంలో జరిగిన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేయడం జరిగింది. ఉత్సవాల నిర్వహణకు మహేష్‌గుప్త తనవంతుగా 11 వేల రూపాయల విరాళంగా అందజేశారు. అమ్మవారిని దర్శించుకున్న ఆయన అమ్మవారి దయతో ప్రజలను ఎల్లవేళలా సుఖసంతోషాలతో చూడాలని ఆయన తెలిపారు. సాయంత్రం శివ్వంపేటలో జరగనున్న భగళాముఖి మహోత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో మహేష్‌గుప్త వెంట సర్పంచులు పత్రాల శ్రీనివాస్‌గౌడ్, రంగాలా ఆంజనేయులు నాయక్, ఉప సర్పంచి రాజిపేట పద్మ వెంకటేష్, టీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షులు భాస్కర్ నాయక్, నాయకులు వంజరి కొండల్, పోచాగౌడ్, దొడ్లె అశోక్, షేక్‌అలీ, రాజిపేట నర్సింలు, గౌరీశంకర్ తదితరులు ఉన్నారు.

## పార్టీ అధిష్టానం ఆదేశిస్తే నర్సాపూర్‌లో పోటీ చేస్తా

### -టీడీపీ రాష్ట్ర నాయకులు వెంకటరమణారావు

**మెదక్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:** మాది మొదటి నుండి రాజకీయ కుటుంబమే అని, నేను నర్సాపూర్ మండల పరిషత్ అధ్యక్షులుగా, సర్పంచిగా పదవీ బాధ్యతలు చేపట్టిన కాలంలో అన్ని విధాలుగా అభివృద్ధి పనులు చేపట్టానని తెలుగు దేశం రాష్ట్ర నాయకులు హనుమంతు వెంకటరమణారావు మంగళవారం శివ్వంపేటలో విలేకరులతో మాట్లాడుతూ అన్నారు. త్వరలో గడపగడపకు తెలుగు దేశం పార్టీని తీసుకెళ్లి మండల, గ్రామాల కమిటీలను నియమిస్తూ పార్టీని మరింత బలోపేతం చేస్తామని అన్నారు. తెలుగుదేశం పార్టీ పునర్నిర్మాణంలో భాగంగా అందరిని కలుపుకొని ముందుకు నడుస్తామని ఆయన చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా ప్రజా వ్యతిరేకంగా ఉందని, దీనివల్ల ప్రజలకు ఒరిగేదేమి లేదని ఆయన ఆరోపించారు. నా రాజకీయ జీవితంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ నాకు గాడ్ ఫాదర్ ఆయన అభిప్రాయపడ్డారు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో తెలంగాణ పూర్తిగా నష్టపోయిందని వెంకటరమణారావు విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం అంకెల గారడి చేస్తుందని వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల నాటి వరకకు గ్రామగ్రామాన తెలుగు దేశం పార్టీని బలోపేతం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఆయన వెంట మండల టీడీపీ పార్టీ అధ్యక్షులు జంగం నగేష్ తదితర నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## కనుల పండుగగా శివ స్వాముల మహా పడిపూజ

**పెద్దశంకరంపేట, ఫిబ్రవరి7 ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఉత్తలూరు గ్రామంలో సోమవారం నవీన్ స్వామి ఇంట్లో శివ స్వాముల మహ పడిపూజ కన్నుల పండుగగా జరిగింది. ఈ సందర్భంగా స్వామి పడిని వివిధ రకాల పూలతో అందంగా అలంకరించారు. భాస్కర్ గురుస్వామి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు కొనసాగాయి. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకాలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివ నామస్మరణతో ఆ ప్రాంగణం మారుమ్రోగింది. శివ స్వాముల భజన కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. ఈ మహాపడిపూజకు భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేసి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో స్వాములు అశోక్, సంగమేశ్వర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు బీజేపీ మండల కార్యవర్గ సమావేశం

**పెద్దశంకరంపేట, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:** నేడు పెద్దశంకరంపేటలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో మండల బీజేపీ కార్యవర్గ సమావేశం నిర్వహించనున్నట్లు మండల బీజేపీ అధ్యక్షులు కోణం విఠల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీజేపీ పార్టీ కార్యాలయంలో బుధవారం ఉదయం 10.30 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు, ఈ సమావేశానికి ఆయా గ్రామాల బూత్ కమిటీల అధ్యక్షులు, కార్యదర్శులు, బాధ్యులు, వివిధ మోర్చాల కమిటీల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, మండల నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు హాజరు కావాలని ఆయన కోరారు.



కల్యాణలక్ష్మిచెక్కులను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

## తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శం: ఎమ్మెల్యే

**సంగారెడ్డి, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:** సిఎం కెసిఆర్ రాష్ట్రంలో ప్రవేశ పెట్టిన సంక్షేమపథకాలు దేశానికేఆదర్శమని నారాయణఖేడ్ ఎమ్మెల్యే ఎం. భూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం నారాయణఖేడ్‌లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నారాయణఖేడ్, నిజాంపేటమండలంతోపాటు ఖేడ్ మున్సిపాలిటీకి చెందిన 133 మందికి మంగళవారం కల్యాణలక్ష్మి చెక్కులను ఆయన అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సిఎం కెసిఆర్ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. ఆడ పిల్లల పెళ్లిళ్లకు తల్లిదండ్రులు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో కల్యాణలక్ష్మి పథకం ప్రవేశపెట్టి ఆదుకుంటున్నారని తెలిపారు. అలాగే కంటివెలుగు పథకంలో భాగంగా కంటిపరీక్షలు నిర్వహించి ఉచితంగా అద్దాలను అందజేస్తున్నారని తెలిపారు. అవసరమైనవారికి శస్త్ర చికిత్సలు జిల్లా ఆసుపత్రికి రెఫర్ చేసి నిర్వహిస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ లక్ష్మిబాయి రవీందర్‌నాయక్, ఎంపీపీ ఉపాధ్యక్షులు సాయిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ రుబినాబేగం నజీబ్, వైస్ చైర్మన్ పరశురాం, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు జగదీశ్వర్‌చారి, పార్టీ మండల అధ్యక్షుడు పరమేశ్వర్, ఎంపీపీ తనయులు రమేష్‌చౌహాన్, కౌన్సిలర్లు, పార్టీ మండల మాజీ అధ్యక్షులు ప్రభాకర్, ఎంపిటీసీలు, సర్పంచ్‌లు, ఆయా గ్రామాల లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఫోటో రైటప్ హెచ్ 5: నూతనంగా ఎన్నికైన నవాబుపేట కురుమ సంఘం

## కురుమ సంఘం నవాబుపేట కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన నవాబుపేట కురుమ సంఘం

**సంగారెడ్డి, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** హత్నూర మండలం నవాబుపేట కురుమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు సంఘం అధ్యక్షులు కొన్యాల మల్లేశం తెలిపారు. మంగళవారం సంఘం కార్యావర్గ సమావేశాన్ని నిర్వహించి, నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. ఉపాధ్యక్షులుగా రంగంపేట శ్రీశైలం,కార్యదర్శిగా కంకరి ఎల్లయ్య, సహాయ కార్యదర్శిగా రంగంపేట మల్లేశం,కోశాధికారిగా జక్కుల నారాయణ, సలహాదారుగా ఎనగండ్ల నారాయణ, కార్యవర్గసభ్యులుగా,కోడూరి మల్లేశం,కంకరి మల్లేశం,ఎం.సత్యనారాయణ, ఇస్మాయిల్‌ఖాన్‌పేట బీరయ్య, వెంకటపురం శ్రీశైలం, రంగంపేట ఎల్లమ్మ, జక్కుల శివనీల ఎన్నికయ్యారన్నారు. గ్రామ కురుమ యువత సంఘం అధ్యక్షులుగా రంగంపేట హరిబాబు, ఉపాధ్యక్షులుగా వెంకటపురం మల్లేశం, కార్యాదర్శిగా కంకరి ఎల్లయ్య, సహాయ కార్యదర్శిగా జక్కుల ప్రభు, కోషాదికారిగా బడంపేట మల్లేశం, సలహాదారుగా జక్కుల బాబయ్య, కార్యవర్గ సభ్యులుగా ఇస్మాయిల్‌ఖాన్‌పేట రాం చందర్, బడంపేట బీరప్ప, రంగంపేట రాములు, జక్కుల రాములు, రంగంపేట మానిఖ్యం, బడంపేట రత్నమ్మ, రంగంపేట అమృతలు ఎన్నికైనట్లు ఆయన తెలిపారు. కార్యాక్రమంలో స్థానిక సర్పంచ్ వెంకటపురం మల్లేశం,కురుమ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పలుగుమీది పోచమ్మ ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం

**హాజరైన మదన్‌రెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి**



ప్రమాణస్వీకారం చేసిన అలయ కమిటీ సభ్యులు

**సంగారెడ్డి, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** హత్నూర మండలం శేర్‌ఖాన్‌పల్లి గ్రామం పరిధిలోని పలుగుమీద పోచమ్మ దేవాస్థానం అలయ కమీటి నూతన కార్యావర్గ ప్రమాణస్వీకారోత్సవం దేవాస్థానంలో జరిగింది. కార్యక్రమానికి ముఖ్యాతిథులుగా ఎమ్మెల్యే సి.హెచ్.మదన్‌రెడ్డి, రాష్ట్రమహిళా కమీషన్ చైర్‌పర్సన్ వి.సునితాలక్ష్మారెడ్డిలు హజరయ్యారు.ఈసందర్బంగా చైర్మన్‌గా ఎన్.సుదర్శన్‌గౌడ్, వైస్ చైర్మన్‌గా మధుసుధన్‌రెడ్డి,సభ్యులుగా నాగభూషణంగౌడ్, టి.నర్సిం లు, జి.పోచయ్య, కె.సునిత, సురేష్, ఎక్స్ ఆఫిషియోసభ్యునిగా ఎం.శ్రీకాంత్‌లచే ప్రమాణస్వీకారం చేయించారు. ఈసందర్బంగా ముఖ్యఅతిథులు మాట్లాడుతూ నూతన కార్యావర్గం ఆలయ అబివృద్దికి కృషి చేయాలని సూచించారు. దేవాలయంకు సిసిరోడ్డు, మిషన్ భగీరథ తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని స్తానికులు కోరారు. అలయ కమీటి ప్రమాణ స్వీకారోత్సంలో ముఖ్యఅతిథులతోపాటు, ఎంపిపి నర్సిం లు, జడ్పీటిసి అంజనేయులు,సర్పంచ్ లక్ష్మినారాయణ,అలయా ఇఒ శశిధర్, టిఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, దుర్గారెడ్డి, అశోక్‌గౌడ్, మన్సూర్, ఆగమయ్య, సుధాకర్, శ్రీనివస్‌గౌడ్, ఎస్.ప్రభాకర్, కిషోర్, వార్డు సభ్యులు, పార్టీ ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు తతితరులు పాల్గొన్నారు.

## హాత్ సే హాత్ జోడో విజయవంతం కావాలని పూజలు



బోరంచ పోచమ్మను దర్శించుకుంటున్న నగేష్ శెట్కార్ తదితరులు

**సంగారెడ్డి ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** హాత్ సే హాత్ జోడో కార్యక్రమం విజయవంతంగా కావాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు మంగళవారం మండలంలోని బోరంగ గ్రామంలోని నల్ల పోచమ్మ తల్లిని వేడుకున్నారు. నియోజకవర్గంలోని ఆయామండలాల్లో నిర్వహించే కార్యక్రమానికి ఎలాంటి ఆటంకాలు కల్గకుండా దీవించాలని అమ్మవారిని వేడుకున్నట్లు ఉమ్మడి మెదక్ జిల్లా ప్రణాళిక సంఘం సభ్యులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు నగేశ్‌కుమార్ శెట్కార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో సిర్గాపూర్, నారాయణ ఖేడ్, నాగల్‌గిద్ద మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మనీస్‌పాటిల్, తామిర్‌అలీ, మాణిక్‌రావు పాటిల్, నారాయణఖేడ్ పట్టణ అధ్యక్షులు సాయిలు పాటిల్, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు సాయిలు,, ఎస్టీసెల్ అధ్యక్షులు నెహ్రూ నాయక్, నాయకులు గుత్తి రమేష్, పిఎసిఎస్ డైరెక్టర్ బస్వరాజ్, మాజీ జడ్పీటిసి సభ్యులు రూప్‌సింగ్, సంజీవ్ పాటిల్, పరశురాం, రాజు, లక్ష్మణ్, వైజనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## పంటలను పరిశీలించిన వ్యవసాయ సంచాలకులు

**పుల్కల్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:**
మండలంలోని ఆయా గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న వరి పంటలను ఏడిఏ పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు ఏడిఏ పలు సూచనలు చేశారు. నారుమడిలో గుళికలు వేయకపోతే నాటు వేసిన పక్షం రోజుల్లో, పిలక దశలో ఉన్న వరిపైరు పైన యాసంగిలో తప్పనిసరిగా ఎకరాకు క్యార్బోప్యూరాన్ 3 గ్రామాల గుళికలు 10 కిలోలు లేదా క్లోరాంట్రనిలిప్రోల్ 0.4గ్రామాలను 4 కిలోలవేసుకోవాలన్నారు. లార్వ దశలో పంట ఉంటే క్రినాల్‌పాసన 2 గ్రాములు, లీటరు నీటికి కలిపి పిచకారి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి చైతన్య, ఏఇఒ మునీరా, పుల్కల్, ముద్దాయిపేట గ్రామాల రైతులు మంగలి రాజు, యం సత్యనారాయణలు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలోనే రాష్ట్రం అభివృద్ధి

**ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి**



మాట్లాడుతున్న భూపాల్‌రెడ్డి

**సిర్గాపూర్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:** బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే పేదల కళ్లలో ఆనందం కనిపిస్తుందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం సిర్గాపూర్ మండల కార్యాలయంలో షాదిముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను 32 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గానిలిచిందన్నారు. గ్రామ గ్రామాలకు తండాలకు సీసీ రోడ్లు, బీటీ రోడ్లు,విద్య, ఆరోగ్యం, ఇలా అన్నిరంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత భారస ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. అదేవిదంగా గల్లీ నుంచి ఢిల్లీ వరకు వారి ప్రభుత్వం ఉన్నప్పుడు ప్రజలకు చేసింది ఏందో చేప్పాలని అన్నారు. కల్ల బొల్లి మాటలకు కాంగ్రెస్ అబద్దాలకు బిజేపీ ప్రభుత్వాలని ఎమ్మెల్యే ధ్వజమెత్తారు. పక్కా రాష్ట్రాల్లో వారి ప్రభుత్వాలు పెన్షన్లు రూ.1200 మాత్రమే ఇస్తుందన్నారు. రాష్ట్రప్రభుత్వం రూ.2000 నుంచి రూ. 3000 వరకు పెన్షన్లు ఇస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 60 సంవత్సరాలు చేయని అభివృద్ధి తెరాస ప్రభుత్వం 9 సంవత్సరాల నుంచి భారస ప్రభుత్వం చేసి ప్రజల్లోకి గర్వంగా తల ఎత్తుకుని వెళ్తున్నామన్నారు.కార్యక్రమంలో సిర్గాపూర్ ఎంపీపీ జార మహిపాల్‌రెడ్డి, ఎంపీపీ ఉపాధ్యక్షురాలు పరగ్ బాయ్ మాధవరావు, ఎంపీడీఓ మంజుల, తహాశీల్దార్ రత్నం, జాగ్రుతి అధ్యక్షులు శేరికర్ అరుణ్ రాజ్, సర్పంచ్‌లు స్వప్న శంకరయ్యస్వామి, సంజీవరెడ్డి, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## 'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి

**సంగారెడ్డి, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:** కంటి వెలుగును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తుర్కపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టరు అమిత్‌రాజ్ అన్నారు. మంగళవారం నారాయణఖేడ్ మండలంలోని ర్యాకల్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందు గోలీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టరు రాజేశ్వర్, వైద్య సిబ్బంది, హెచ్ఎం చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## ఆలయాలను దర్శించుకున్న కాట శ్రీనివాస్‌గౌడ్



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

**అమీన్‌పూర్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామంలో నిర్వహించిన శ్రీభ్రమరాంబిక మల్లికార్జుస్వామి, ఎల్లమ్మతల్లి, బీరప్ప కామరతి కళ్యాణ మహోత్సవంలో పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కాట శ్రీనివాస్‌గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీనివాస్‌గౌడ్ దంపతులకు శాలువ పూలమాలతో ఆలయ కమిటి సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అమీన్‌పూర్ మండల అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, సుధాకర్‌యాదవ్, రవీందర్, సత్యనారాయణ, మహేష్, శ్రీకాంత్‌యాదవ్, మూసాపేట్ మహేందర్, సహదేవ్, నరసింహ, ఎల్లయ్య, భిక్షపతి, గోపాల్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ నరేష్, సాయి. అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## కట్టమైసమ్మ తల్లి విగ్రహా ప్రతిష్టాపనకు రూ. 50 వేలు విరాళం

**అమీన్‌పూర్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** మండలంలోని పటేల్‌గూడ గ్రామంలో ఈ నెల 10వ తేదీ నుండి 13వ తేదీ వరకు నిర్వహించబోయే కట్ట మైసమ్మ తల్లి విగ్రహా ప్రతిష్టాపన మహోత్సవానికి పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కాట శ్రీనివాస్‌గౌడ్ 50వేల రూపాయలను విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో క్రిష్ణగౌడ్, రమేష్‌గౌడ్, రాజుగౌడ్, మాణిక్యం, ప్రభుగౌడ్, సతీష్‌గౌడ్, శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న కళాజాత ప్రదర్శన

**పుల్కల్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన పుల్‌కల్‌లో మంగళవారం జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ మెదకన జిల్లా పుల్కల్ బ్రాంచి ఆధ్వర్యంలో కళాజాత ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. డిసిసి బ్యాంక్ అందిస్తున్న సేవలపై ప్రదర్శన ద్వార ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మేనేజర్ శ్రీలత, ఎబిఎం మురళి, పుల్కల్ ఎంపిటిసి సభ్యులు శ్రీనివాస్‌చారి, సొసైటీ సీఈవో, డైరెక్టర్లు, బ్యాంక్ ఖాతాదారులు పాల్గొన్నారు.

## శ్రీపార్థివేశ్వరస్వామి ఆలయ శివరాత్రి మహోత్సవ కరపత్రాల ఆవిష్కరణ

**గజ్వేల్, ఫిబ్రవరి 7 (ప్రభాతవార్త):** మహ శివరాత్రి సందర్భంగా ప్రజ్ఞాపూర్‌లోని శ్రీ పార్థివేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించనున్న శివరాత్రి మహోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి, ఏఎంసి చైర్మన్ మాదాసు శ్రీనివాస్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ పార్థివేశ్వరస్వామి ఆలయం చాలా పురాతన దేవాలయం అని, స్వయంభూ లింగ ఆలయంగా ప్రసిద్ది చెందినదని అన్నారు. పూర్తిగా రాతి కట్టడంతో నూతనంగా ఆలయ శిఖరం నిర్మించడం జరిగిందన్నారు. శివున్ని నమ్ముకున్న భక్తుల కోరికలు నెరవేరుతాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రతి శివరాత్రి రోజున స్వామివారి ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈనెల 17వ తేదీ నుండి 19వ తేదీ వరకు జరుగనున్న ఉత్సవాలలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారి అనుగ్రహం పొందాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు తుమ్మ శ్రీనివాస్, దేవాలయ ధర్మకర్త బెజుగామ విఠల్‌శర్మ, సాయిరెడ్డి, చంద నాగభూషణం, గుజ్జ వెంకటేశం, ఆత్మ కమిటీ చైర్మన్ ఊడెం కృష్ణారెడ్డి, స్థానిక కౌన్సిలర్లు తలకొక్కుల భాగ్యలక్ష్మిదుర్గాప్రసాద్, మర్కంటి వరలక్ష్మికనకయ్య, పంబాల అర్చనశివకుమార్, రజితగౌడ్, బొగ్గుల చందు, వార్డు అధ్యక్షుడు దాకని బిక్షపతి, బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీరా, కో-ఆప్షన్ సభ్యులు ఉమర్, నంగునూరి సత్యనారాయణ, బిఆర్ఎస్ నాయకులు మన్నె వెంకటేశం, సాయిబాబా, రామచంద్రం పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ, ఎఫ్‌డిసి చైర్మన్



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

## అంగరంగ వైభవంగా చండీ హోమం

**సదాశివపేట, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** మండల పరిధిలోని తంగడపల్లి శ్రీ కోటి బిల్వ లింగేశ్వర మఠం గురు గంగాధరస్వామి ఆశ్రమంలో 27వ వార్షిక మహోత్సవంలో భాగంగా నాల్గవ రోజు అంగరంగ వైభవంగా చండీ హవనం నిర్వహించినట్లు షట స్థల బ్రహ్మ శ్రీశ్రీశ్రీ శివయోగి శివాచార్య మహాస్వామి అన్నారు. గోపూజ మహాగణపతి ఆవాహిత మంటపహారాధన, త్రిశక్తి చండి హవనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిత్వికులు జంగం మహేశ్‌స్వామి, జంగం విజమ్‌స్వామి, కేదార్నాథ్‌స్వామి, ఎంకార్‌స్వామి, సతీష్‌స్వామి, భక్తులు పాల్గొన్నారు.

## ఈఎంఆర్ఐ సంస్థలో ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానం

**పాపన్నపేట, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** ఈఎంఆర్ఐ సంస్థలో ఉద్యోగాలు పొందేందుకు ఈ నెల 14వ తారీఖున నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని ఉమ్మడి మెదక్ జిల్లా ప్రోగ్రాం అధికారి జాన్ షాహిత్, మెదక్ జిల్లా సూపర్‌వైజర్ మహేశ్‌కుమార్‌లు సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. సంస్థలో పైలట్ ఈఎంటిఈ ఆరక్ష్య ఉద్యోగాల నియామకానికి ఈ నెల 14న మేడ్చల్ సమీపంలో గల ఈఎంఆర్ఐ కార్యాలయానికి హాజరుకావాలని వారు సూచించారు. పైలెట్ ఉద్యోగానికి 10వ తరగతి ఉత్తీర్ణులు అయి ఉండాలని, లైట్ మోటారు వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, వయసు 23 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాల లోపు ఉండాలన్నారు. ఈఎంటి ఉద్యోగానికి బిఎస్సీ నర్సింగ్ తదితర సంబందిత కోర్సు పూర్తి చేసి ఉండాలని, వీఆర్వో ఉద్యోగానికి ఇంటర్మీడియట్ లేదా ఏదైనా డిగ్రీ పూర్తి చేసి ఉండాలని, కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలన్నారు. పూర్తి వివరాలకు 9494309644నను సంప్రదించాలన్నారు.

## చెరుకు రైతులను ఇబ్బందులు పెట్టొద్దు : ఎమ్మెల్యే



ట్రైడెంట్ అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

**జహీరాబాద్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** ట్రైడెంట్ చక్కర కర్మాగారానికి చెరుకును తోలిన నియోజకవర్గంలోని చెరుకు రైతులకు ఎలాంటి ఇబ్బందులు పెట్టకుండా సకాలంలో బిల్లులు అందించాలని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు ట్రైడెంట్ అధికారులకు సూచించారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రైతులకు బిల్లులు సకాలంలో చెల్లించాలన్నారు. పరిశ్రమలో అన్ని సౌకర్యాలు, ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో చక్కర అభివృద్ధి సంస్థ కమీషనర్ రాజశేఖర్, ట్రైడెంట్ చక్కర పరిశ్రమ అధికారి సత్యనారాయణ, ఆత్మ కమిటి చైర్మన్ పెంటారెడ్డి, నాయకులు విజేందర్‌రెడ్డి, బాబా పాల్గొన్నారు.

## సబ్బండ వర్గాల సంక్షేమ బడ్జెట్

**సిద్దిపేట రూరల్, ఫ్రిబవరి 7, ప్రభాతవార్త :** రాష్ట్ర బడ్జెట్ అన్ని రంగాలను సంతృప్తిపరిచేలా ఉందని బిఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షులు మెరుగు మహేష్ అన్నారు. సబ్బండ వర్గాల సంక్షేమ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఆర్థిక, ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావును హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో మంగళవారం కలిసి పూల మొక్కను అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడిన 8 ఏళ్లలో అభివృద్ధి సంక్షేమానికి రూ. 290396 లక్షల కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టుకోవడం సంతోషంగా ఉందన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ సుపరిపాలనకు బడ్జెట్ నిదర్శనమన్నారు. తెలంగాణ లక్ష్యాలు నీళ్ల, నిధులు, నియమకాలు మంత్రి హరీష్‌రావు నేతృత్వంలో జరగడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్వీ నాయకులు బిక్షపతి నాయక్, యాదగిరి, శ్యామ్ యాదవ్, మహిపాల్‌గౌడ్, రమేష్, అరవింద్‌రెడ్డి, రాజు, రవి, నరేష్, విజయ్, సతీష్ తదితరులు ఉన్నారు.



హరీష్‌రావుకు పూల మొక్కను అందజేసి కృతజ్ఞతలు తెలుపుతున్న బిఆర్ఎస్వీ నాయకులు



గెలిచిన మల్లయోదుడిని సన్మానిస్తున్న ఎస్ఐ, నాయకులు

## న్యాల్‌కల్ జాతరలో కుస్తీ పోటీలు

**-ప్రతిభ చాటిన వారికి బహుమతులు**

**న్యాల్‌కల్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** న్యాల్‌కల్ గ్రామ శివారులోని హజ్రత్ పీర్ గైబ్ సాహెబ్ జాతర ఉత్సవాల్లో మంగళవారం అంతర్‌రాష్ట్ర కుస్తీ పోటీలు నిర్వహించారు. కుస్తీ పోటీలను తిలకించేందుకు ఆయా ప్రాంతాల నుంచి యువకులు పెద్ద సంఖ్యలో చేరుకుని ఈలలు వేస్తుండగా కేరింతలు కొడుతుండగా మల్లయోదులు కుస్తీపడ్డారు. కుస్తీ పోటీల్లో ప్రతిభ చాటిన మల్లయోదులకు జడ్పీటిసి సభ్యురాలు బోడ స్వప్న, న్యాల్‌కల్ ఎంపిటిసి తనయుడు వెంకట్ పడకంట, గ్రామ సర్పంచ్ తనయుడు మఠం శివస్వామి సహకారంతో 20 తులాల వెండి కడియాన్ని ఎస్ఐ వినయ్‌కుమార్, జాతర నిర్వాహకులు, నాయకులతో కలిసి మల్లయోదులకు అంద చేశారు. మండలంలోని ముంగి బిఆర్ఎస్ నాయకులు సయ్యద్ షకీలన 16 వేల నగదును పూణేకు చెందిన మల్లయోధుడు ప్రసాద్ షిండేకు బహుకరిం చారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## బస్సు తోలుతుండగా డ్రైవర్‌కు అనారోగ్యం

**-పిహెచ్‌సికి తరలించిన కండక్టర్ మల్లికార్జున్**

**న్యాల్‌కల్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** డ్రైవర్ ముందస్తుగా జాగ్రత్త పడటంతో పెద్ద ప్రమాదమే తప్పిందని చెప్పవచ్చు. ఇందుకు సంబంధించి బస్సు కండక్టర్ అందించిన సమాచారం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రంలోని జిల్లా కేంద్రమైన బీదర్ ఆర్టీసి డిపో బస్సు (కెఏ 38-1098) హైద్రాబాద్ నుంచి బీదర్ పట్టణానికి 19 మంది ప్రయాణీకులతో పరుగులు తీస్తోంది. బస్సు సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలోని మిర్జాపూర్(బి) గ్రామ శివారులోకి రాగానే బస్సును తోలుతున్న డ్రైవర్ జగన్నాథ్‌కు ఉన్నంటుండి చెమటలు పట్టడం, కండ్లు బైర్లు కమ్మడం ప్రారంభం కావడంతో డ్రైవర్ బస్సును ఆపేసి విషయాన్ని బస్సు కండక్టర్ మల్లికార్జున్‌కు వివరించారు. డ్రైవర్ కండ్లు కమ్మిపోతున్నా అవేమి పట్టించుకోకుండా బస్సును ముందుకు తోలితే పెద్ద ప్రమాదమే జరిగేదని చెప్పవచ్చు. యాదృశ్చికమో, ప్రయాణీకుల, కండక్టర్, డ్రైవర్‌ల అదృష్టమో తెలియదు కాని బస్సును రోడ్డు పక్కన ఆపేసి అటుగా వెళుతున్న వారిని విచారించగా పర్లాంగు దూరంలోనే మిర్జాపూర్(బి) ప్రాథమిక ఆరోగ్య కేంద్రం జహీరాబాద్-బీదర్ రోడ్డు పక్కనే ఉన్నట్లు తెలుపడంతో బస్సు కండక్టర్ మల్లికార్జున్ డ్రైవర్‌ను ఆస్పత్రికి తరలించగా ఆస్పత్రి వైద్యులు రూపేన్ చక్రవర్తి డ్రైవర్‌కు చికిత్సలు అందించారు. డ్రైవర్ కోలుకునేంత వరకు ఆస్పత్రిలోనే కండక్టర్ మల్లికార్జున్ దగ్గరుండి సేవలు అందించారు. బస్సులోని ప్రయాణీకులను అంతకు ముందే ఇతర బస్సులో పంపేశారు. అనారోగ్యం నుంచి డ్రైవర్ కోలుకున్నాక ఆస్పత్రి వర్గాలకు కృతజ్ఞతలు తెలిపి బీదర్ పట్టణానికి పయనమయ్యారు.

## నేడు న్యాల్‌కల్‌లో పాత పంటల జాతర

**న్యాల్‌కల్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** ఈ నెల 8వ తేదీన న్యాల్‌కల్‌లో దక్కన్ డెవలప్‌మెంట్ వారు పాత పంటల జాతర సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు దక్కన్ డెవలప్‌మెంట్ బాధ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు న్యాల్‌కల్‌లో నిర్వహించే జాతరలో పాత పంటల ప్రాముఖ్యతపై చర్చించడం జరుగుతుందన్నారు. పాత పంటల జాతరను పురష్కరించుకుని ప్రతి సంవత్సరం న్యాల్‌కల్‌లో రైతులతో సమావేశం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. న్యాల్‌కల్‌లో జరిగే కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు, మండల అధికారులు, రైతు సంఘాల నాయకులు, రైతులు హాజరవుతూ తమ సూచనలు, సలహాలు చేస్తూ వస్తున్నారు. ఈ పర్యాయం సైతం మండల కేంద్రంలో డిడిఎస్ వారు పాత పంటల జాతర సమావేశాన్ని నిర్వహిస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో జడ్పీటిసి భర్త భాస్కర్‌కు గాయాలు

**-ఆస్పత్రిలో భాస్కర్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే**

**జహీరాబాద్/న్యాల్‌కల్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** కారు బోల్తాపడిన సంఘటనలో న్యాల్‌కల్ మండల జడ్పీటిసి భర్త, బిఆర్ఎస్ మండల నాయకులు బోడ భాస్కర్‌కు గాయాలైన సంఘటన మంగళవారం ఉదయం జహీరాబాద్ పట్టణంలోని జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. పోలీసులు, నాయకుల కథనం ప్రకారం... న్యాల్‌కల్‌కు చెందిన బోడ భాస్కర్ మంగళవారం ఉదయం తన కారులో ప్రయాణిస్తుండగా కారు అదుపు తప్పి బోల్తా కొట్టింది.ప్రమాదంలో భాస్కర్‌కు గాయాలు కావడంతో పట్టణంలోని బాలాజీ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో భాస్కర్ చికిత్స అందుకుంటున్నట్లు తెలుసుకున్న జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు ఆస్పత్రికి చేరుకుని భాస్కర్‌ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడగితెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని ఆస్పత్రి డాక్టర్లకు ఎమ్మెల్యే సూచించారు. ఎమ్మెల్యే వెంట సిడిసి చైర్మన్ ఉమాకాంత్ పాటిల్, ఆత్మకమిటి చైర్మన్ పెంటారెడ్డి, న్యాల్‌కల్ మండల బిఆర్ఎస్ అధ్యక్షులు మున్నూర్ రవీందర్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

**జహీరాబాద్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** గుర్తు తెలియని వ్యక్తి శవం (45 సవంతరాలు అందాజగా) రోడ్డు పక్కన లభ్యమైన సంఘటన మంగళవారం పట్టణ శివారులోని పస్తాపూర్ కమాన్ వద్ద గుర్తించారు. పట్టణ ఎస్ఐ శ్రీకాంత్ కథనం ప్రకారం...మంగళవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో గుర్తు తెలియని మగ వ్యక్తి శవం గుర్తించామన్నారు. మృతుడి శరీరంపై బ్లూ చెక్స్ షర్టు, నల్లని ప్యాంటు, కుడి చేతి పై పచ్చబొట్టు ఉందన్నారు. శవానికి జహీరాబాద్ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి శవాన్ని మార్చురీలో భద్రపర్చినట్లు పేర్కొన్నారు. మృతి చెందిన వ్యక్తిని గుర్తిస్తే జహీరాబాద్ టౌన్ పోలీసు ఠాణాను సంప్రదించాలని, 8712656763కి ఫోన్ చేయాలని ఎస్ఐ సూచించారు.

## వివాహిత అదృశ్యం

**ఝరాసంగం, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** తన తల్లి ఈశ్వరమ్మ (37) ఆచూకి కనిపెట్టి అప్పగించాలని వేడుకుంటూ మండలంలోని మాచ్‌నూర్ గ్రామానికి చెందిన గడ్డలి నాగరాజు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు అందించాడు. ఎస్సై రాజేందర్‌రెడ్డి కథనం ప్రకారం... గ్రామానికి చెందిన గడ్డలి ఈశ్వరమ్మ (37) ఈ నెల 4వ తారీఖున రాత్రి 9 గంటల ప్రాంతంలో ఇంట్లో ఎవరికి చెప్పాపెట్టకుండా వెళి పోయిందన్నారు. ఈశ్వరమ్మ ఆచూకి కోసం బంధువుల వద్ద వెతికినా ప్రయోజనం లేకపోవడంతో మంగళవారం అదృశ్యమైన ఈశ్వరమ్మ తనయుడు గడ్డలవి నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

## వ్యక్తి అదృశ్యం

**సంగారెడ్డి టౌన్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** నాగల్‌గిద్ద మండలంలోని కరస్‌గుత్తి గ్రామానికి చెందిన చాకలి దశరథ్ అదృశ్యమైన సంఘటన జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో ఈ నెల 3వ తారీఖున చోటు చేసుకుంది. సంగారెడ్డి పట్టణ ఎస్ఐ కథనం ప్రకారం... గ్రామానికి చెందిన దశరథ్‌కు ఫీట్స్ వ్యాధి సోకిందని తనయుడు చాకలి చెన్నప్పను ఈ నెల 2వ తేదీన సంగారెడ్డిలో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స అందుకుంటూ ఈ నెల 3న ఎండలో కూర్చుంటానని ఆస్పత్రి బయటకు వచ్చి కూర్చున అక్కడి నుంచి ఎక్కడికో వెళ్లిపోయాడన్నారు. అదృశ్యమైన ధశరథ్ కుమారుడి ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

## ఇంట్లో నుంచి వెళ్లిపోయిన వివాహిత

**-తనకోసం వెతకొద్దంటూ లెటర్**

**కంది, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** తన కోసం వెతకొద్దంటూ ఉత్తరం రాసి పెట్టి ఇంట్లోనుంచి ఓ వివాహిత వెళ్లిపోయిన సంఘటన మండలంలోని ఉత్తర్‌పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ కథనం ప్రకారం... గ్రామానికి చెందిన గొల్లపల్లి రమ్య (19) ఈ నెల 5వ తారీఖున రాత్రి 10 గంటల ప్రాంతంలో ఇంట్లో ఉత్తరం రాసిపెట్టి మెడలోని తాళిని, మట్టెలను డ్రెసింగ్ టేబుల్‌పై ఉంచి ఎక్కడికో వెళ్లిపోయిందన్నారు. 6వ తారీఖున కుంటుం సభ్యులు రమ్య కోసం గదిలో చూడగా కానరాలేదన్నారు. రమ్యతో రఘువీర్‌గౌడ్‌కి 31 జులై 2022న వివాహం జరిగిందన్నారు. రమ్య, రఘువీర్‌గౌడ్‌లది ఒకే గ్రామం కావడం ఇక్కడ కొసమెరుపు.

# క్రీడాకారుల్లో ప్రతిభను గుర్తించేందుకు పోటీలు దోహదం

**డిసిసిబి ఉమ్మడి మెదక్ జిల్లా ఉపాధ్యక్షుడు పట్నం మాణిక్యం**




మాట్లాడుతున్న పట్నం మాణిక్యం

**సంగారెడ్డి మున్సిపాలిటి ఫిబ్రవరి 7,ప్రభాతవార్త:** గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లోని ప్రతిభను గుర్తించేందుకు తమ సంస్థ ఎల్లప్పుడు సిద్దంగా ఉంటుందని పట్నం మాణిక్యం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, డిసిసిబి ఉమ్మడి మెదక్ జిల్లా ఉపాధ్యక్షుడు పట్నం మాణిక్యం అన్నారు. వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల పిఇటి, పిడిలకు టెన్నికాయిట్‌పై నేడు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఒక రోజు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యాక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పట్నం మాణిక్యం మాట్లాడుతూ గ్రామీణా ప్రాంతాలలో నైపుణ్యం కలిగిన క్రీడాకారులు ఉన్నారని, వారి ప్రతిభను గుర్తించేందుకు పోటీలు దోహదపడతాయన్నారు. సిఎం కెసిఆర్ జన్మదినం సందర్భంగా ఈనెల 17న సంగారెడ్డిలో నియోజకవర్గస్థాయి క్రీడలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఒకరోజు కాకుండా వారంరోజుల పాటు ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రీడావారోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. క్రీడలకు పిఇటిలు, పిడిలు సహకరించాలని ఆయన కోరారు. క్రీడా వారోత్సవాలలో సుమారు ఐదువేల మంది పాల్గొనేలా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పట్నం మానిక్యం తెలిపారు. కార్యక్రమంలో టెన్నికాయిట్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యాదర్శి శ్యామ్ సుందర్, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్, ప్రధాన కార్యాదర్శులు రామకృష్ణ, కళావతి, సంఘాల నాయకులు శర్ఫోద్దీన్, ఆసీఫ్, కిష్టయ్య, టెన్నికాయిట్ సంఘం జిల్లా ప్రధాన కార్యాదర్శి వెంకటేశం, సీనియర్ ఉపాధ్యాయులు బక్కప్ప, ఆమూల్యా, నాగరాజు జిల్లాలోని వివిద పాఠశాలలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయురాళ్లు పాల్గొన్నారు.